కులమత ద్వేషాలు కూలద్రోయుడటంచు
చేయెత్తి బోధనల్ చేయవలయు
దీనుల సేవయె దివ్యమార్గమటంచు
పలుమారు గట్టిగా పలుకవలయు
నామ చింతన నరు స్వామి సన్నిధి చేర్చి
అమృతత్వమందించు ననగవలయు
భక్తి విశ్వాసంబు బాగుగా కల్గిన
వారలు మనవారలని వచించు.
జ్ఞానబోధలు నరులకు చేయువారు
భేదభావంబు విడనాడి ప్రీతితోడ
కలసియుండిన సాయికి కల్గు ప్రేమ
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!

అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః

ప్రేమ స్వరూపులారా!

అష్టైశ్వర్య స్వరూపమైన యీ గుణములు ఏ మానవుని యందు వుండునో అట్టి మానవుడే భగవంతునికి అత్యంత ప్రియుడు. మొట్టమొదటిది అనపేక్ష. అనపేక్ష అనగా ఎట్టి అపేక్షలు లేకుండా వుండటం. శరీర మనో బుద్ధులు ధరించిన మానవుడు అపేక్ష లేకుండా వుండగలడా! ఇది అసాధ్యము. కాని యిట్టి స్థితిని ప్రయత్నపూర్వకముగా మానవుడు సాధించవచ్చును. ప్రపంచములో అనేకమంది అప్పటికప్పుడు ఆనందమును అందించే యింద్రియ సుఖములు ఆశిస్తుంటారు. ఇట్టి యింద్రియములు అందించే సుఖముతో అమిత ప్రజలు ప్రేమిస్తూ వుంటారు. దీనినే ప్రేయో మార్గమని బోధించింది. దీనికి భిన్నముగా శాశ్వతానందమును అందింపజేసి ఇంద్రియాతీతమైన సుఖమునందించి దివ్యత్వమైన మార్గమున ప్రవేశింపజేయునది

ఆత్మాను భూతి. దీనినే శ్రేయో మార్గమని మరొక పేరుపెట్టింది గీత. ఈ శ్రేయో మార్గము అందరికి అర్థమయ్యేది కాదు. అందరికి అందుబాటులో వుండదు. కనుకనే యిట్టి శ్రేయో మార్గమును ప్రజలు అమితంగా విశ్వసించలేకపోతున్నారు. ఒకవైపున ప్రేయో మార్గము, రెండవ వైపున శ్రేయోమార్గము ప్రపంచమునందున్న ప్రజలను తమ తమ వైపు మరల్చు నిమిత్తము ప్రయత్నిస్తూ వుంటాయి. కాని యింద్రియానందమును కోరే ప్రజలు యీ ప్రేయో మార్గమునే ఆశిస్తూ వుంటారు. ఈ భౌతిక సుఖములను లెక్క చేయక అనిత్యము అశాశ్వతము లోక సంబంధమైన సుఖములను యేమాత్రము ఆశించక నిష్ఠులై ద్రష్టులై పవిత్రమైన హృదయమును పొందిన ఒక్క జ్ఞానులు మాత్రమే శ్రేయో మార్గమును ఆశిస్తారు.

(1) శ్రేయస్సుకు ప్రేయస్సుకు అతీతమైన మరొక మార్గము కూడా వుంటున్నది. సమస్త అభీష్టములు యీ శ్రేయస్సు నందు ప్రేయస్సునందు అంతర్భూతములై వుంటాయి. ప్రపంచమునందుగల అభీష్టములన్నింటిని యీ శ్రేయస్సు, ప్రేయస్సు ప్రధానమై అంతర్వాహినిగా ప్రవహిస్తూ వుంటాయి. ఈ రెండింటికిని అతీతమైనదే అనపేక్ష అనే మార్గము. ఈ అనపేక్ష అనగా ఎట్టి అపేక్షలు లేకపోవటము. కాని యిది సరియైన అర్థము కాదు. మానవుడు చేయు సమస్త కర్మలందు నేనుసేవ చేస్తున్నాను అనే అహంకారము, నేను అనుభవిస్తున్నాను అనే అభీష్టమును త్యజించినప్పుడు యిది అనపేక్షగా మారిపోతుంది. ఆచరణ యందు అహంకారము, అనుభూతి యందు ఆసక్తి రెండింటిని త్యజించినప్పుడు అనపేక్ష అనేది రూపొందుతుంది. అనగా మానవుడు చేసే సమస్త కర్మలయందు కూడను కర్తృత్వ భోక్తృత్వములు త్యజించినప్పుడే అనపేక్ష అనే స్వరూపాన్ని ధరిస్తుంది. సర్వకర్మలను భగవత్ప్రీత్యర్థముగా అర్పితము గావించినప్పుడే అనపేక్ష రూపాన్ని పొందుతుంది. ఇట్టి అనపేక్ష హృదయమునందు ఆవిర్భవించిన వ్యక్తిని భగవంతుడు ఐక్యము గావించుకుంటాడు. ఇట్టి అనపేక్ష కలిగిన వ్యక్తినే భగవంతుడు ప్రేమిస్తాడు. కనుక భగవంతుని ప్రేమకు పాత్రులు కావలెనన్న సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థము గావించే సేవలలో మనము పాల్గొనాలి. ఎవరికి చేసినా, ఎక్కడ చేసినా, ఎప్పుడు చేసినా యివన్నీ కూడను భగవదర్పితమనే భావముతో మనము చెయ్యాలి.

ఇంక రెండవది శుచిః. అనగా శుభ్రత అని. అంతర్ బహిః శుభ్రతగా వుండాలి. శారీరకమైన పరిశుద్ధము లోక సంబంధమైనటువంటిది. స్నానాదులతో దేహము

320119003

పరిశుద్ధము గావించుకోటము, శుభ్రమైన వస్త్రములు ధరించటము, భుజించే ఆహారమును పరిశుద్ధముగా వుండేటట్లు చూచుకోటము. వండే వంటలయందు పరిశుభ్రము అభివృద్ధి గావించుకోటము. పాత్రశుద్ధి., పదార్థ శుద్ధి, పాకశుద్ధి కొంతవరకు గమనించాలి. నిత్య జీవితములో మానవుడు అనుభవించే ప్రతి పదార్థము కూడను పరిశుద్ధముగా వుంచుకోవాలి. పదార్థములే కాక మనము విద్యాభ్యాసము చేసే సమయమందు పుస్తకములు పరిశుభ్రముగా పెట్టుకోవాలి. ఇది భౌతికమైన పరిశుభ్రత. ఈ పరిశుద్ధములు ఎన్నివుండినప్పటికిని అంతశుద్ధియే లేకపోయిన యిది నిరుపయోగము. పండితుని మొదలు పామరుని వరకు కూడను బాహ్యమైన పరిశుద్ధమునకే పాటుపడుతున్నారు గాని అంతశుద్ధికి లోనయే మాత్రం పాటుపడుటం లేదు. పాత్ర ఎంత శుద్ధముగా తోమి పెట్టినప్పటికిని అందులో వండే వంటకు, యీ పాత్రకళాయి లేకపోయిన ఈ పదార్థమంతయు నిరుపయోగమవుతుంది. కనుక హృదయమనే పాత్రను పరిశుద్ధము గావించుకోటమే ప్రధానమైన సాధన. దీనిని పరిశుద్ధము చేసుకొనుటకు స్వార్థరహితమైన సేవలో మనము ప్రవేశించాలి. రాగద్వేషముల చేత మనోబుద్ధులు మాలిన్యమవుతాయి. ఇట్టి అశుద్ధమైన మనోబుద్ధులను స్వార్థరహితమైన సేవలద్వారా మనము పరిశుద్ధము గావించుకోవాలి. మనోబుద్ధులు పరిశుద్ధముగా వుండినప్పుడే నిష్కామసేవలో పాల్గొనగలడు. మనోబుద్ధులు అశుద్ధముగావుండినప్పుడు మనము చేసే కర్మలు అశుద్ధముగానే రూపొందుతాయి. కనుక శారీరమానసిక పరిశుద్ధములు మానవునికి ప్రధానమైన కర్తవ్యములు.

(2) మూడవది నిష్ఠ. అనగా ప్రతిమానవుడు తన జీవితములో ఒక నిష్ఠను పూనాలి. జీవితము వున్నంతవరకు కూడను పవిత్రమైన కార్యములలో ప్రవేశించి ప్రజాసేవలో మనము పాల్గొని తద్వారా పుణ్యకార్యములు మనము పోషించుకోవాలనే భావము ప్రతిమానవుని యందు కూడను ఆవిర్భవించాలి. ప్రజాసేవ చేత మానవుని యొక్క ఏకత్వాన్ని పొందవచ్చు అనే విశ్వాసాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సంఘసేవ ద్వారా ఏకత్వము ప్రాప్తిస్తుంది. ఏకత్వము ద్వారానే దివ్యత్వము పొందవచ్చును. ఈ దివ్యత్వమును పొందటమే పవిత్రమని భావించాలి. కనుక ప్రతి మానవుడు తాను జీవించినంత కాలము 'పరోపకారార్థం ఇదం శరీరమ్' ఈ శరీరము వచ్చినటువంటిది పరోపకార సంబంధమైన భావముగా మనము విశ్వసించాలి. ఎప్పుడు స్వార్థము, స్వప్రయోజనము యీ రెండింటి యందు మానవుడు లీనమైనప్పుడు యింక పరార్థమనే యదార్థ తత్వాన్ని వారితిగా గుర్తించగలడు. స్వార్థాన్ని త్యాగము చెయ్యాలి. ఈ త్యాగము

చేయాలనుకుంటే సమాజసేవలో పాల్గొనాలి. ఈ సమాజసేవలో అహంకారము నిర్మూలమవుతుంది. ఏకాత్మ భావము ప్రాప్తిస్తుంది. కనుక యిలాంటి దీక్షను పూనిన వాడు భగవంతునకు పరమ ప్రీతి.

(3) నాల్గవది ఉదాసీనత. అనగా సుఖదుఃఖములనుగాని మంచి చెడ్డలనుగాని కీర్తి ప్రతిష్టలనుగాని లెక్క చేయనక్కరలేదు. నీవు చేసిన కర్మలు పవిత్రమైనవా కాదా అని మనస్సాక్షిగా గుర్తించాలి. ఇది మంచి కార్యము. ఇది పవిత్రమైన కార్యము. సమాజములో యిది సరియైన సేవ అని విశ్వసించిన తరిని ఏ విషయమునందు మనము లెక్క చేయనక్కరలేదు. మంచి కార్యములలో మానవుడు ప్రవేశించినప్పుడు అనేక విధములైన ఆటంకములు వస్తూ వుంటాయి. ఇతరులు కూడను దూషించ వచ్చు. ఇతరులు హాస్యాస్పదము చేయవచ్చు. వీటి నన్నింటిని మనము లెక్కచేయనక్కరలేదు. నీహృదయానికి నీవు సాక్షిగా నిల్వాలి. నేను చేయు కర్మ మంచిదా చెడ్డదా అని విచారణ చేసి, పరిశీలనలో నీవు దాన్ని పరీక్షించుకోవాలి. అది మంచిదని నీ అంతర్వాణి బోధించినప్పుడు ఎవ్వరు ఏమి చెప్పినా నీవు లెక్క చేయనక్కరలేదు. బంధువులుగాని మిత్రులుగాని, తల్లి తండ్రులుగాని ఎవరైనా దీనికి అడ్డు తగిలినప్పుడు నీవు యే మాత్రము లెక్కచేయకు. ఈ విధమైన దీక్షను పూనినప్పుడే, యీ ఉదాసీన భావము కల్గినప్పుడే నీవు సంకల్పించిన దానిని పూర్తి సాధించగలవు. ప్రతి కార్యమునందు కూడను అదిరి బెదిరి వుంటుంటే యేమాత్రము నీవు విజయాన్ని సాధించలేవు. కనుక నీవు యీవిధమైన ఉదాసీన భావము లోపల కొంత వరకు గమనించవలసినది. రాజకీయములకు అతి దూరముగా వుండాలి. రాజకీయములందు ప్రవేశించినప్పుడు హృదయము కూడను రజోగుణముగా మారిపోతుంది. రజోగుణము తనయందు ఆవిర్భవించినప్పుడు గౌరవ మర్యాదల కోసం పాటుపడుతుంది. కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించాలని అభిలషిస్తుంది. ఇలాంటి వాంఛలవల్ల నీ మనస్సు మాలిన్యము చెందుతుంది. కనుకనే ఉదాసీన భావమనేది లౌకికమైన జగత్తునకు అతి దూరంగా వుండి మానసిక సంబంధమైన ప్రేమ చేత సమస్త మానవులకు సేవ చేయటానికి తగిన కృషి చెయ్యాలి. ఈ ఉదాసీనమనే విషయము లోపల అనేక విధమైన భావాలు మనలో ఆవిర్భవించవచ్చు. కాని ఉదాసీనత అనగా యేమీ లెక్కచేయకుండా అహంకారము చేత లేక ఆడంబరము చేత గర్వము చేత, పొగరుబోతుతనము చేత పోవటము ఉదాసీనత కాదు. మంచిని విసర్జించక చెడ్డను లెక్క చేయకుండా పోవటమే నిజమైన ఉదాసీనత.

మంచిని మన హృదయమునందు ఆవిర్భవింప చేసుకున్నప్పుడు ఏ ఒక్కదాన్ని కూడను మనము వెళ్ళి చేయ నక్కర లేదు.

(4) ఇంక ఐదవది. గతవ్యథః. అనగా గడచిపోయినదానిని మనం చింతించ నక్కరలేదు. మనో కలత చెందిన వాడు ఎట్టి కార్యములోను పాల్గొన లేడు. ఈ మానసిక కలత మానవునకు ఏమాత్రము ఉపకారము చేయదు. ఎప్పుడో గడచిపోయిన విషయాన్ని మనం చింతించి ప్రయోజనము లేదు. ఎప్పుడో రాబోయే విషయాన్ని గురించి మనం చింతించ కూడదు. కనుక గతమును భవిష్యత్తును విస్మరించి వర్తమానమునందే లక్ష్యమును అభివృద్ధి పరచుకోవాలి. ఈనాడు ప్రపంచములో సమస్త దుఃఖములకు మూలకారణమిదియే. ఉన్నదానిని వదలి లేనిదానిని ఆశించి, గడచిపోయినదానిని చింతించి లేని దుఃఖమును తెచ్చుకొనుచున్నాడు మానవుడు. గడచినది గడచినది. ఎంత ప్రయత్నము చేసినను ముందుకు రాదు. ఇంక భవిష్యత్తు కాలగర్భములో దాచుకొని మనకు తెలియని పరిస్థితిలో వుంటున్నది. ఈ భవిష్యత్తు మనకు కనుపించదు. కనుపించని దాని నిమిత్తమై నీవు ప్రయత్నము చేయుటము కేవలము వెర్రితనము. వర్తమానమును లక్ష్యములో పెట్టుకొని నీవు మనశ్శుద్ధిగా కార్యములో పాల్గొను. వర్తమానమునందే గతము భవిష్యత్తు ఇమిడి వుంటున్నవి. ఏ తిండి తిన్నావో నీవిప్పుడు ఆ త్రేపును తీసుకొస్తావు. ఇప్పుడు ఏమి భుజిస్తున్నావో భవిష్యత్తులో అదే త్రేపు నీకు వస్తుంది. కనుక భవిష్యత్తు గతము రెండు వర్తమానమునందే వుంటున్నవి. కనుక నీవు వర్తమానమును సరియైన దృష్టియందుంచుకొని పవిత్రమైన భావముతో నీవు కార్యములో పాల్గొనాలి. కనుక గతించిన దానికి వెతనొంద నక్కర లేదు. నడచుకొని వచ్చిన దారిని చూచుకొనే వచ్చాము. ముందు దారి చూడాలగాని గడచిపోయినది చూడకూడదు. మనము గడచిపోయినదానిని గాని భవిష్యత్తుగాని చింతించకూడదు. ఈ రెండింటిని చింతించక వర్తమానమునే లక్ష్యమునందుంచుకొని పవిత్ర కార్యములలో పాల్గొనినవాడు భగవంతునకు అత్యంత ప్రియుడు.

ఇంక ఆరవది. సర్వారంభ పరిత్యాగి. అనగా ఆడంబరములో మనము ఎట్టి కార్యములు కూడను ఆచరించరాదు. ఆడంబరము, అహంకారము వుండినంత వరకు ఆడంబరము చావదు. ఆడంబరము చావకుండా చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధి లేనివాడు పవిత్ర కార్యములు ఆచరించలేడు. కనుక పవిత్ర కార్యముల వల్లనే చిత్తశుద్ధి లభిస్తుంది. 'చిత్తస్య శుద్ధయే కర్మః'. కనుక చిత్తశుద్ధిని గావించే కర్మలే మానవులు ఆచరించాలి.

320119006

ఆడంబరమనేది మానవునకు రాక్షస గుణము. ఈ గుణమునందు రాగద్వేషములు, మోహము అమితంగా అభివృద్ధి అవుతాయి. మమత్వము, మోహము రెండింటియొక్క చేరిక చేతను ద్వేషము కూడను ఆవిర్భవిస్తుంది. కనుక ఆడంబరమనేది మానవత్వాన్నే నిర్మూలిస్తుంది. ఏది చేసినా తాను ఒక వినయ విధేయతతో కార్యములో పాల్గొనాలి. ఈ ఆడంబరమనేది తనను తానే ఒక విధమైన అవమానము చేస్తున్నవాడిగా వుంటాడు.

(5) సమాజసేవయందే తనకు సరియైన కీర్తి లభిస్తుంది అనే విషయమును బలపరచుకోవాలి. నిజముగా సేవ చేయువానికే నిజమైన అధికారము. అలాంటి వాడే నిజమైన శక్తి సామర్థ్యములు కలవాడు. దేశమునకు నాయకుడు కావాలనుకుంటే సేవకుడుగా వుండి ఆ సేవ ద్వారా మనము తగిన వినయ విధేయతలను పెంచుకొని తద్వారా సేవా తత్వాన్ని బోధించాలి. ఈ సేవయందు ఎట్టి అధికారము కూడను ఆశించరాదు.

దేశసేవకుండె దేశనాయకుడైన
స్వార్థ రహిత సేవ చేయుచుండు
పదవి కాంక్షవాడు పరిశుద్ధ హృదయుడా
చెప్పరయ్యా మీరె ఒప్పుకుందు.

పదవి కాంక్షల చేత ఎట్టి సేవలు మనము చేయకూడదు. కానీ దురదృష్టవశాత్తు యీనాడు పనులకు వెనుక పదవికి ముందు వుంటున్నాడు మానవుడు. సంస్థలంతా సేవ నిమిత్తమై ఏర్పడినవి గాని పదవి కోసము కుస్తీ పడుట కాదు. ప్రతి మానవుడు కూడను యిది నా కర్తవ్యము సేవ నిమిత్తమై అందించినది యీ దేహము కనుక సేవ ద్వారానే కాయమును సార్థకము గావించుకోవాలి అనే పరిపూర్ణ విశ్వాసముతో యీ సేవలో పాల్గొనాలి.

ఇచ్చినట్టి పనిని మెచ్చునటుల చేయ
సార్థకంబౌను సమితులన్ని
అటుల చేయకున్న ఆత్మద్రోహమె కదా
మరువబోకు ఓట్టి మంచి మాట.

మానవుడు ఎంత శ్రీమంతుడైనప్పటికిని, ఎంతటి ఉత్తమ పదవి యందుండినప్పటికిని తనయందున్న అశాంతిని ఏమాత్రము దూరము చేసుకోలేడు. ఈ అశాంతిని దూరము గావించుకొనే ఏకైక మార్గము స్వార్థరహిత సేవ మాత్రమే. కనుక ప్రపంచమునందుగల సమస్త సుఖములు కూడను మానవుని చింతింప జేస్తున్నవే గాని తనను ఉద్ధరింప చేయుట

320119007

ము లేదు. మానవుని సుఖములు, ఆనందములు, ఐశ్వర్యములు వచ్చినవని మనము ఏమా
త్రము కూడను పొంగిపోరాదు. ఇవి వచ్చునవి మాత్రమే గాదు. పోవునవి కూడను. సుఖదుః
ఖములు మానవునకు చుట్టముల వంటివి. వచ్చిపోయే చుట్టముల వంటివి గాని స్థిరము
గా నిల్చెటువంటివి కాదు. అట్టి అనిత్యము అశాశ్వతమైన సుఖదుఃఖములను ఆశించి
నిత్య సత్యమైన దివ్యత్వము మనము విస్మరించి జీవితమును వ్యర్థము గావించుకుంటు
న్నాము. సేవ మానవత్వము యొక్క దివ్యత్వమును ప్రకటింప జేస్తుంది. హృదయమును
విశాలము గావిస్తుంది. సంకుచిత భావములను దూరము గావిస్తుంది. ఆనందము నంది
స్తుంది. ఐక్యతను గావిస్తుంది. ఆత్మ తత్వమును బోధిస్తుంది. ఈ సేవవలన మనయందు
న్న సమస్త దుర్గుణములు పోతాయి. కనుక సేవలు మానవునకు ప్రధానమైన సాధనలుగా
భావించాలి. నీవు సేవ నిమిత్తమై పుట్టిన వాడవే గాని నాయకత్వము నిమిత్తమై పుట్టినవా
డు కాదు. ప్రపంచమునందు ప్రతి వ్యక్తి కూడను సేవకుడే గాని నాయకుడు కాదు. భార్య
భర్తన సేవకురాలు. భర్త భార్యకు సేవకుడు తల్లి బిడ్డ సేవకురాలు. బిడ్డ తల్లి సేవకుడు.
దాసుడు యజమాని సేవకుడు. యజమాని దాసుని సేవకుడు. ఒకరికొకరు సేవాభావము
తో జీవించటమే యీ జగత్తు కేవలము అభివృద్ధి చెందుచున్నదిగాని సేవాతత్వమే లేకపోతే
జగత్తే లేదు. ఏదో నీవు అధికారిని అధికారిని అని విశ్వసిస్తున్నావే గాని ఏమాత్రము కాదు. ప్ర
తి మానవుడు కూడను సేవకుడే. ఈ సేవాభావముతో వుండినప్పుడే మానవత్వము దివ్యత్వము
గా అభివృద్ధి పొందుతుంది. అప్పుడే మానవుని యందు శాంతి చేకూరుతుంది.

శాంతి లేక పోవటానికి కారణము ఏమిటి? ఏ కార్యము చేసినప్పటికిని త్రికరణ
శుద్ధితో మనము చేయటం లేదు. ఏమి చెప్పినా, ఏమి చూసినా, ఏమి చేసినా సర్వము కూడను
త్రికరణ శుద్ధితో చేయాలి; చూడాలి, చెప్పాలి. అప్పుడే మనము శాంతి అనుభవించటానికి అవకాశము
వస్తుంది. ఇంటిలో వున్న ముగ్గురు వ్యక్తులు కూడను ఒకరికొకరు అన్యోన్యముగా అభిమానంగా, ఆనం
దంగా జీవించినప్పుడే యింటిలో శాంతి ఏర్పడుతుంది. ఇంటిలో వున్న ముగ్గురు కూడను ఒకరికొ
కరు విరుద్ధమైపోయి ద్వేషాన్ని పెంచుకోటంచేత ఆ యింటిలో శాంతి ఏరీతిగా లభిస్తుంది.
కనుక ఈ దేహమనే యింటిలో మనస్సు, వాక్కు, కర్మ యీ మూడింటితో కూడినదే యీ యిల్లు. కర
ములతో చేసే కర్మలు, వాక్కుతో ఆడే పదములు, మనస్సుతో చింతించే తలంపులు మూడు
ఏకమైనప్పుడే మనకు శాంతి ఆవిర్భవిస్తుంది. అట్లు కాకుండా మనస్సునందు ఒకటి, తలచటము
మాటలో ఒకటి చెప్పటము, క్రియలో మరొకటి చేయుటం చేత మనకు అశాంతి అభివృద్ధి అవు

తున్నది. అశాంతికి ఎవరు కారణము. మనమే కారణము. మనము త్రికరణ శుద్ధిగా లేకపోవటం వలన మనయింటిలో వున్న ముగ్గురు సరియైన ఏకత్వముగా వుండక పోవటం చేతనే యీ అశాంతికి మూలకారణము. కనుక ఐకమత్యము అత్యవసరము. ఐకమత్యము వలనే ఆనందమున్నది. ఈ ఆనందమువలనే శాంతి మనకు చేకూరుతుంది.

ఐకమత్యము లేకుండా ఆనందము మనము ఏనాటికి అందుకోలేము. ఈ ఆనందము లేక శాంతి మనకు లభ్యము కాదు. కనుక శాంతిని మనము పొందాలనుకుంటే, సౌఖ్యమును మనము అనుభవించాలనుకుంటే త్రికరణ శుద్ధిని మనము అభివృద్ధి పరచుకోవాలి. త్రికరణ శుద్ధి మాత్రమే కాదు. త్రికరణములు ఏకంగా భావించాలి. ఇది యీనాడు ప్రపంచములో కరవైపోయింది. ఇంటియందు, దేశమునందు శాంతి అనేది ఎక్కడా లేకపోతున్నది. వ్యక్తియందే శాంతి లేనప్పుడు ప్రపంచమునందు శాంతి ఏ రీతిగా లభిస్తుంది. వ్యక్తి బాగుపడినప్పుడే సమాజము బాగుపడుతుంది. సమాజము బాగుపడినప్పుడే దేశము బాగుపడుతుంది. కనుక వ్యక్తి ముందు మారాలి. మానవుడు మారినప్పుడే దేశము మారుతుంది. మనిషి అనగా మనస్సే. మనస్సనగా తలంపుల యొక్క చేరికయే. తలంపుల ఫలితమే నిత్యజీవితములో మన చర్యలు. ఆ చర్యల యొక్క ప్రభావమే సుఖదుఃఖములు. ఈ సుఖదుఃఖములకు కారణము ఎవరు? మన చర్యలే కారణము. మన నడతలు సరిలేకపోవటమే మన దుఃఖములకు కారణము. ఈ నడతలకు ఏమి కారణము. మన సంకల్పమే కారణము. ఈ సంకల్పముల చేరికే మనస్సు. మనస్సు లేక మనిషి లేడు. కనుక మనస్సును సరియైన రీతిగా తీర్చిదిద్దుకోవాలి. వేదాంతమునందు 'మన యేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' ఈ బంధమోక్షములకు మనస్సే మూలకారణము. చేతిలో కత్తి వున్నప్పుడు మంచి చేయవచ్చు. చెడ్డ చేయవచ్చు. అదే విధముగా యీ మనస్సనే ఆయుధము మనయందు వుంటున్నది. ఆ ఆయుధాన్ని సరియైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు పవిత్రమైన దానిని ఆచరించినవారమవుతాము. పుణ్యపాపములకు మూలకారణము మనస్సే.

పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల దగిలియుండు

కనుక దివ్యత్వముగాని, అపవిత్రముగాని మానవుని యొక్క ఆచరణయందే యిమిడి వుంటున్నది. ప్రేమస్వరూపులారా! మానవుని యొక్క దివ్యత్వాన్ని గుర్తించి ఐకమత్యముతో వుండి యీ సంకుచితమైన భావము దూరము గావించుకోండి.

1990 నవంబరు 20వ తేదీ మంగళవారం శాంతివేదిక, శ్రీసత్యసాయిహాల్ ప్యూస్టేడియంలో భగవాన్ బాబావారిచ్చిన దివ్యోపన్యాసం.